# ఇదా పరిష్కారం..?

చీకటి - చీకటి . అంతా చీకటి మయం. చిన్న దీపం వెలుతురు. అమ్మవారి ముక్కు మీద వజ్రపు పొడిలా మెరుస్తూంది. ఏ మూలనుండో కీచురాయి, కీచు కీచు మని యంత్రపు యినుప చక్రాలు రాసుకుంటున్నట్లుగా అరుస్తూంది. - దేముడితో ఏదో మొర పెట్టుకుంటున్నట్లు దూరంగా రెండు కుక్కల ఏడుపులు - ఘూర్ఖావాడు... లాఠీ చప్పుడు చేసుకుంటూ సారా హుంషార్ చేస్తూ పోతున్నాడు.

ఇదంతా రోజూ వున్నదే - ప్రత్యేకించి - ఆలోచిస్తే తప్పు యిందులో వింత ఏమీ లేదు ! కాని ముకుందానికి నిద్ర పట్టలేదు... ఆలోచనలు వెంటాడుతూంటే - యినస్నీ తోడపుతున్నాయి.

మంచం మీద నుండి లేచాడు - నాల్గువయిపులా చూశాడు - అద్దె కుంటున్న ఆ ఒక్క గదిలోనూ- తనొక్కడికే, మంచం. మిగతా అందరూ మంచం చుట్టూరా క్రింద చాపలూ, బొంతలూ పరచుకు పడుకున్నారు - మంచానికి క్రిందనే దగ్గరగా తన భార్య లక్ష్మి పడుక్కుని వుంది - ఆమె ప్రక్కనే ముగ్గురు కూతుళ్ళూ - యిద్దరు కొడుకులూ పడుక్కున్నారు వరుసగా- పెద్దకొడుకు - ఎక్కడకు వెళ్ళేడో యింట్లో లేడు.. యిదీ తన ఆస్థి.

భార్య తీస్తున్న సన్నటి గుర్రు తప్పితే అంతా నిశ్శబ్దంగా వుంది. అందరూ గాఢ నిద్రలో వున్నారు- రాత్రి రెండు గంటలు దాటి వుంటుంది - దూరంగా... ఎత్తు; బెక్కుతూ బెక్కుతూ.. ఎక్కుతున్న రైలు చప్పుడు - రోజూ లాగే ఆనాడూ, ఆ సమయానికి వినిపిస్తూంది. అయినా అలవాటయిన శబ్దాలే కాబట్టి ఎవరికీ మెళుకువ రాదు.

తల పగిలేటన్ని ఆలోచనలు... పరిష్కారం కాని సమస్యలు - వీటి వల్ల తనకు మాత్రం నిద్ర పట్టలేదు. అలా గడిపిన ఎన్నో రాత్రులలో యిది ఒకటి - మెల్లగా లేచి - చప్పుడు కాకుండా- ఎవరినీ తగలకుండా కాళ్ళ మధ్యగా, చేతుల మధ్యగా, ఖాళీగా వున్నచోట్ల అడుగులు వేసుకుంటూ వరండాలోకి వచ్చాడు. ... అక్కడ తన ఆలోచనల వాలు కుర్చీలో కూర్చుని గతంలోని అనుభవాలను జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు...

తన ఏభై రెండేళ్ళ జీవితంలో... ఏం సాధించాడు ? - కరెంటు పోయింది కాబోలు... ఆ మినుకు మినుకు మంటున్న చిన్న దీపం కూడా ... ఆరిపోయింది.... తన బ్రతుకులో... ఆశల్లాగానే...

ఏమీ లేని బీదవాళ్లు - లేకపోతే - ఎంతో గొప్పవాళ్ళు - యీ రెండు రకాల వాళ్లే ఏమయినా సాధించగలిస్తే - సాధించగలరు - అంతేగాని మధ్య తరగతి - తన లాటి వాళ్లు- ఎందుకూ పనికిరారు...

ఏమీ సాధించలేరు... ఎందువల్ల నంటే - అవకాశాలు రావు - వచ్చినా వినియోగించుకోలేరు. అభిమానమో, నిజాయితీయో, అశక్తతో - అడ్డువస్తుంది!

శక్తీ, శాపమూ రెండూ ప్రసాదింపబడిన త్రిశంకుడిలా...

ఆ రోజు... మేనేజరుగార్ని... కలుసుకొని - వినయంగా - ఎంతో దీనంగా - ప్రార్థించాడు-

తన పెద్ద కొడుకు రామం - బి. ఎ. ప్యాసయి నాలుగేళ్లయినా ఎక్కడా ఉద్యోగం దొరకలేదని; పనీపాటు లేక వూరమ్మట, వృధాగా తిరిగి పాడై పోతున్నాడని... యింకొక ఆర్నెల్లలో - ఉద్యోగం కోసం గవర్నమెంటు వారు పెట్టినగడువు తీరిపోతుందని, తన గుమస్తా జీతంతో ఆరుగురు పిల్లల్ని, భార్యని పోషించుకోవడం కష్టంగా వుందని. ఇద్దరు కూతుళ్ళు ఎదిగి కూర్చున్నా పెళ్ళిళ్లు చేయలేకపోయాడని. ముప్పై ఏళ్ళ సర్వీసులోనూ ఒక పైసా కూడా వెనకవేయ లేకపోయాడని... యిలా తన కష్టాలన్నీ చెప్పుకున్నాడు. అతి దీనంగా తన బాధలన్నీ చెప్పుకొని -

ఏ ఉద్యోగమయినా, ఆఖరికి బంట్రోతు వుద్యోగమయినా సరే తన కొడుకుకు వేయించమని వేడుకున్నాడు. ఇప్పుడన్ని సంస్థలలోనూ - ఉద్యోగస్తుల పిల్లలలో ఒకడికి- ఆ సంస్థలో ఉద్యోగం తప్పకుండా యివ్వాలనే నినాదం వుంది, అలా యిస్తున్నారు కూడా. అంచేత కనికరించమని ప్రాధేయపడ్డాడు - ఆఖరికి - తనను యిప్పుడే రిటైర్ చేసి, తన కొడుకుకు ఆ జాగాలో ఉద్యోగం యిప్పించినా సరే... అని విన్నవించుకున్నాడు.

అధికారులకు కూడా యిలాటప్పుడే - ఆజ్ఞలో, అనుజ్ఞలో, ప్రాపకాలో, పక్షపాతమో ఎన్నో అడ్డువస్తూ వుంటాయి.

'పాపం ! నీవు చెప్పింది విని నాకు జాలి వేస్తూంది. తోటి మనిషిగా. సానుభూతి చూపించగలను- తప్పితే - అధికారిగా - నేను కొన్నిటికి కట్టుబడి వుండాలి కదా. నీవు చెప్పింది నిజమే- ఉద్యోగస్తుల పిల్లలకి - ఉద్యోగాలు యివ్వాల్సిందే - కాని - మొదట్లో కొన్నాళ్లు రిటైర్ అవగానే అతని వారసునికి పని యిచ్చేవారు. కాని రానూ రానూ రిటైర్ అయిన వాళ్ల హోదాలో కొత్తగా వచ్చిన వాళ్లని వేసుకోవడం జరగదు కాబట్టి ఆ ఖాళీలకు బయట నుండి అర్హతగల వాళ్లని తీసుకోక తప్పడం లేదు. అందువల్ల క్రొత్త వాళ్లని - ఉద్యోగస్తుల పిల్లలినే అన్నిటి లోనూ తీసుకోవడం వీలుపడదు. యింక వారికి తగిన ఖాళీలు ఎన్నని ఉంటాయి? యీ కారణం వల్ల అవకాశాలు లేకుండా పోతున్నాయి. కాబట్టి యిప్పుడు రిటైర్ అయిన వెంటనే వారి పిల్లలకి ఉద్యోగం లభించే రోజులు పోయినాయి... అయితే ఆ ఉద్యోగి మరణిస్తే. మాత్రం . యిస్తున్నాం.. మరి నా చేతిలో మాత్రం.. ఏముంది చెప్పు!''

అని - తను ఎంతో బాధ పడుతున్నా ఏం చేయలేని స్థితిలో వున్నట్టు చల్లగా చెప్పేడు..

''... అయితే ... నేను చస్తేనే గాని - నా కొడుక్కి ... ఉద్యోగం యివ్వరన్నమాట....'' అని పళ్లు నుండి అన్నాడు - కాని మరుగుతున్న నీళ్లయినా మంటలని ఆర్పగలవే గాని - మండింప గలవా?... ఆ కోపంతోనే - తన ఉద్రేకాన్ని చల్లార్చుకున్నాడు... విరక్తితో - నవ్వుకున్నాడు.

''అంతే కదా ... మరి! '' అని అనేసి - మరో పనిలో పడిపోయాడు మేనేజర్... తన లాటి వాడితో - యిలాటి స్వల్పమయిన విషయాలతో ... విలువయిన సమయాన్ని ఎంతసేపని వృధా

చేస్తాడు?

తన కార్డు వరకూ వచ్చేక - ''స్టాకు'' అయిపోయింది!'' అని అంటే - ఎలా వుంటుందో అలాగయింది ముకుందం పరిస్థితి -

ఆ పరిస్థితి కలిపించ బడుతుందా ? నిజంగా వస్తుందా ? ఎలా అయితేనేం - అలాటి ఆఖరి క్షణంలో కూడా సాధించగలిగే తెలివయిన వ్యక్తులు కొందరుంటారు.... కాని ముకుందం అలాటి ప్రయోజకుడు కాడు... తగిలే దెబ్బలకి తలవంచడమే గాని... ఎదురు తిరిగి నిలబడే ఓపిక పోయింది అతనిలో -

జీవిత సమరంలో నిరాయుధుడయిన సైనికుడిలా ఓడిపోయాడు -

నిరాశతో, వున్న ఆ ఒక్క ఆశ కూడా చచ్చిపోగా.... శూన్య మనస్కుడై యివతలకు వచ్చేశాడు... ఆ రోజుతో ఆ ప్రయత్నం కూడా అలా అయిపోయింది.

.... తన పెద్ద కొడుకు రామం... పాపం వాడు మాత్రం ఏం చేస్తాడు.? చదువుకున్నాడు.. డిగ్రీ తెచ్చుకున్నాడు. ఎక్కడయినా, ఏదయినా పని దొరుకుతుందేమోనని, ఆఫీసులంట, షాపులంట, ఫ్యాక్టరీలంట, యిలా అన్ని చోట్ల తిరిగి, తిరిగి, ఎక్కడా దొరక్క నిరాశచెంది పోయేడు. అక్కడికీ చేదోడు వాదోడుగా వుండాలని, ఎలాటి పని అయినా ఆలోచించకుండా కొన్ని చిన్న చిన్న ఉద్యోగాలు చేయబోయేడు - కాని జీతం మాట, పనిమాట ఎలావున్నా వాళ్లు చూసే చిన్న చూపులకు, ఆత్మాభిమానం పౌరుషం - చంపుకోలేకపోయేడు. అందువల్ల అలాటి ప్రయత్నాల కన్నా ఊరికే వుండడం మంచిదనుకున్నాడు.

అలాటి వాడిని ఏమీ అనకూడదనుకుంటూనే వుంటాడు. అయినా పరిస్థితుల వల్ల- యింటికి వస్తే కోపంలో తను ఏదో అనడం - వాడేదో జవాబు చెప్పడం ... భార్య ఎటూ చెప్పలేక సముదాయించడం- మిగతా పిల్లలు బిక్కు బిక్కుమని వుండడం- రోజూ ఏదో ఘర్షణ.... యిదే నిత్యం యింట్లో జరిగేది. అంచేత వాడు ఎప్పుడో గాని యింటికి రావడం మానుకుంటున్నాడు... వున్నా... తనకి ఎదురవకుండా తప్పుకొని వుంటున్నాడు... ఎక్కడ తిరుగుతున్నాడో, ఏమో! ఆ పరిస్థితిలో ఏ అఘాయిత్యం చేస్తాడో ఏమో! అన్న బెంగ ఒక ప్రక్క... వాడూ పెద్ద వాడవుతున్నాడు... ఏవో కోర్కెలు వుంటాయి. అవసరాలు వుంటాయి. జేబు ఖర్చుకు కనీసం రోజుకొక రూపాయి యివ్వడానిక్కూడా తన దగ్గర వుండదు... ఏం చేయగలడు ?

తన జీతం, సంపాదన, యింట్లో ఖర్చులూ వాడికి మాత్రం తెలీదూ ? రోజూ డబ్బులు కావాలంటే- తను కాదనడం - వాడు జవాబు చెప్పడం, ఏమీ అనకూడదనుకున్నా మాటకు మాట పెరగడం - గొడవ జరగడం - పస్తులూ - యిలా రోజులు వెళుతున్నాయి.

భార్య మెడలో పసుపు కొమ్ము తప్పితే మరో ఆభరణం లేదు. ఒకింటి వాళ్లను చేయలేక ఎదిగిన కూతుళ్ల మొహాలు చూడలేకపోతున్నాడు. చిరిగిన పరికిణీలు, చీరలు, - గిల్టు నగలూ, యివీ వాళ్లు అనుభవిస్తున్న జీవితం.

పెద్ద కూతురుకి ముప్పై ఏళ్లు వచ్చేయి, రెండోదానికి మరో రెండేళ్లు తక్కువ. పెళ్లిళ్లు చేయాలని ఎంత ప్రయత్నించినా, అవలేదు... ఏదో తన తాహతుకు తగ్గ సంబంధాలు చేద్దామన్నా... వారడిగే కట్నాలిచ్చే స్తోమత లేక - యిన్నాళ్ళూ జరగలేదు. యిహ మీదట జరుగుతాయన్న ఆశ కూడా పోయింది. మిగిలిన యిద్దరు కొడుకులూ, కూతురూ చిన్న వాళ్లు కాబట్టి వాళ్ల బెడద అట్టేలేదు.

రాను రాను యింటి పరిస్థితులు మారిపోతున్నాయి. తన మీద, తన మాట మీదగౌరవం, భక్తి అందరికీ సడలిపోతున్నట్టున్నాయి. భయం అసలే లేదు.

కొన్నాళ్లు సహించి, సహించి పెద్దవాడు రాము ధైర్యం చేసి ఒకనాడు

''నాన్నా మీకు ఖర్చు పెట్టడం తెలీదు... అందుకే జీతం చాలడం లేదు - ఆ జీతం తీసుకోగానే-యీ నెల మండి నాకివ్వండి - నేను చూసుకుంటాను -'' అని అన్నాడు. ఆశ్చర్యం వేసినా ముకుందం-ఏమీ అనలేదు. ఏదో మాట వరసకి అని వుంటాడని పట్టనట్టు వూరుకున్నా మర్యాద దక్కని పరిస్థితి రానే వచ్చింది. జీతం పెద్ద వాడి చేతిలో పెట్టక తప్పలేదు.

తనకోసం అయిదు రూపాయిలన్నా వుంచుకుందికి ధైర్యం చాలలేదు. ఎందుకంటే- ''చూశారా? యింత వయసొచ్చి మీకే ఖర్చుకి వుండాలిసింది మరి నాకు అవుసరం వుండదని ఎలా అనుకున్నారు?'' అని ఎక్కడ అనేస్తాడో అని - జీతం అంతా పూర్తిగా యిచ్చేసాడు. అప్పటినుండి - వాడే ఖర్చు పెట్టడం మొదలు పెట్టాడు... ఆ నిర్ణయాన్ని అతని భార్య కూడా వెనుకేసుకు రావడం - మరీ ఆశ్చర్యమనిపించింది.

తను యింటి ఖర్చు చూసుకొనేపుడు నెలాఖరున వారం రోజులు ముందు నుండీ యిబ్బంది పడేవారు. అలాటిది యిప్పుడు నెల సగం గడియక ముందే కటకట లాడే స్థితి వచ్చింది. ఒకటో రెండో చాలీ చాలని రోజులు కూడా వస్తున్నాయి. అయినా యింట్లో అందరికీ యిదే బావున్నట్టుంది.

ముకుందం కూడా అంత నిస్పృహలోనూ ఊపిరి పీల్చుకున్నాడు. రాము జేబు ఖర్చు గురించి యింట్లో కురుక్షేత్రం తప్పిపోయింది. యిదితే అదితే... అని అతనిని అడగడం మానేశారు... అదే పెద్ద రిలీఫ్.

''యింక బుర్రలు బద్దలు కొట్టుకోవడమే తప్పింది.'' అని అతని భార్య ఒకటి రెండు సార్లు అనగా విన్నాడు - నిజమే. - ఆ కోపంలో ఏ చెప్పగలం? దరిద్రమే అన్నిటికీ కారణం! అది ఏమయినా చేస్తుంది... అని అనిపించింది.

ఎవరి నోటంట విన్నాడో ఏమోగాని రామం - యింట్లో వాళ్ల అమ్మ దగ్గరా - అక్క చెల్లెళ్ల దగ్గరా యింటికి వచ్చే బంధువుల తోనూ -

''తనంత తను రిటైర్ అయిపోతే - వారి కొడుకులకి ఉద్యోగాలు యిస్తారట!... యింకెన్నాళ్లు కనుక? మా నాన్న గారు రిటైర్ అయిపోతే నాకు ఉద్యోగం దొరుకుతుంది. మరి ఆ ఆలోచన తనకి తోచదాయె! చెబితే నువ్వు చెప్పొచ్చేవా? అని కేక లేస్తారు; నాకా మరెక్కడా ఉద్యోగం పుట్టడంలేదు!.. వయస్సు దాటి పోతూంది!...అది కాస్తా అయాక అడుక్కు తినడం తప్పితే వేరే గత్యంతరం లేదు!... యింట్లో పది పైసలు కూడా అడుక్కుంటేనేగాని గతి లేదు... యిదంతా నా ఖర్మ!...'' యిలా

అనడం మొదలెట్టేడు. తను వుండగా కూడా వీనీ వినబడనట్టు.

ఆ మాటలు విని భార్య లక్ష్మి కూడా -

'' అదేదో... వాడంటున్నది నిజమే కాబోలు - అలా చేయరాదూ ! వాడికి ఉద్యోగం అయితే మీకు యిష్టం కాదా ! ఏం ? మీకూ యింకా ఎన్నాళ్లు వుంది కనుక ? హాయిగా రిటైర్ అయి - ఆ వుద్యోగం రాముకి యిప్పించి హాయిగా కూర్చోండి ! . ఎవడికోసం పోషిస్తాడు ? .. వాడికి మాత్రం తెలియదా ?'' అని అమాయకంగా అడిగేసింది.

కాని అందులో సాధక బాధకాలు ఆవిడకేం తెలుసు ? ఇన్నాళ్లు సర్వీసు చేసినా తెచ్చిన జీతం పూర్తిగా చాలడం లేదు. మరి క్రొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి అంత జీతం యిస్తారా ? దాని వల్ల ఏం జరుగుతుంది?... అయినా అడిగి చూశాడు మేనేజర్ని... అతనలా అంటాడని తనకు ముందే తెలుసు. జరిగిన విషయం యింట్లో చెబితే ఎవరూ నమ్మలేదు.

ఎలా అడగాలో చేత కాదన్నారు...

తండ్రి కాబట్టి - ''అయితే వెంటనే చచ్చిపోయి నాకా ఉద్యోగం యిప్పించు అని అనలేకపోయి వుంటాడు రాము. ....ఉద్యోగం లేకపోయినా - డబ్బు లేకపోయినా అలవాట్లకు మాత్రం తక్కువేం వుండదు ! సిగరెట్లు - సినిమాలు చిరుతిళ్లు - వీటన్నిటికి ఎలా వస్తాయి? అంచేత అప్పుడప్పుడు యింట్లో కనబడిన గిన్నె, ముంతా, వాడకుండా మూల వున్న సామాన్లూ, అమ్మడం మొదలెట్టేడు. జీతం అంతా తనే తీసుకుని ఖర్చు చేస్తున్నా... వేటికీ మిగుల్చుకోలేకపోతున్నాడు.

తానయితే - అందర్నీ ఒకే విధంగా చూసుకొనేవాడు... అందులోనే కూతుళ్లకు ఏవో కొని తెస్తూండేవాడు.... నెలకోసారయినా సినిమాలకు వెళ్లేవారు. అధికారం రాము చేతుల్లోకి మారేసరికి అవన్నీ ఆగిపోయినాయి.... అందరూ నోరు మూసుకు వూరుకున్నారు... తండ్రి కాబట్టి అతనిని పూర్వం సాధించేవారు... యిప్పుడు ఏమీ అనడానికి భయం ! ... తిట్లూ, పెద్ద కేకలూ, రభస, యింతే కదా... అందుకని వూరుకొనేవారు.

ఎవరికయినా జీవితంలో ఒకప్పుడు కాకపోతే ఒక్కప్పుడయినా సుఖం, సంతోషం అన్నవి వుంటాయి కాని తన జాతకంలో ఆ రెండూ భగవంతుడు వ్రాయడం మరిచిపోయాడు. తనేకాకుండా తనతోపాటు - తన భార్య పిల్లలూ, కూడా యాతన పడుతున్నారు. తల్లిని, తండ్రిని అందర్నీ వదులుకుని... తనతో వచ్చి, జీవితాన్ని పంచుకున్నందుకు లక్ష్మికి లభించినదిలాటి నికృష్టమయిన బ్రతుకు... తనేమీ సుఖ పెట్టలేకపోయినా ఆమె ఎప్పుడూ అలా బాధ పడలేదు... కష్టాలే యిష్టంగా పంచుకున్నది.

అందరి లాగే తనూ ఎన్ని కలలు కన్నాడు ? ఎన్నెన్ని సాధిద్దామనుకున్నాడు ? ... పూయగానే పూవు పరిమళిస్తుంది అన్నట్టు - పుట్టగానే తండ్రి పోయినపుడే అతని జాతకం తెలిసిపోయింది ! ముద్దూ ముచ్చటా లేకుండా అలాగే తాతగారింట పెరిగి చదువుకున్నాడు. పెద్ద చదువులు చదివించే దిక్కెవరు ? .. స్కూల్ ఫైనల్ వరకే మహా కష్టంగా గడిచింది.

వెంటనే ఉద్యోగ ప్రయత్నాలు మొదలెట్టేడు. - అవి మన దేశానికి స్వతంత్ర్యం వచ్చిన క్రొత్త...

ఉద్యోగాలు దొరకడం చాలా కష్టంగా వుండేది. ప్రణాళికలన్నీ కాగితాల మీదనే వుండేవి... పనులు మాత్రం ఆలశ్యంగా జరిగేవి - ప్రయత్నించగా.. ప్రయత్నించగా యిప్పుడు తన పెద్ద కొడుక్కి లాగే - తనకూ యింక వయో పరిమితి దాటిపోతుంది అనగా ... ఎలాగో యీ గుమస్తా గిరి దొరికింది.

ఈత రానివాడు - ఏట్లో కొట్టుకుపోతూ, ఏది దొరికితే దానినే పట్టుకు గట్టెక్కడానికి చూస్తాడు. అలా అదే పదివేలనుకొని - అందులో చేరిపోయాడు! సరి! ముప్పై ఏళ్ళయినా - జీతం గొర్రితోక బెత్తెడే. సీనియర్ క్లర్క్ ప్రమోషన్‌తో ఆగిపోయింది!

కులం కన్న గుణమే ప్రధానం అనేవారు. కాని యిప్పుడు గుణం ఎలా వున్నా కులానికే ప్రాధాన్యం యిస్తున్నారు. అదే అడ్డు వచ్చింది తన ప్రమోషన్‌కి! ... రోజులు మారిపోతున్నాయి. ఒకప్పుడు మతం కోసం, ప్రాణాలను ధారపోసేవారు... యిప్పుడు ఏవో కొన్ని కోర్కెల కోసం, మతాన్నే మార్చేసుకుంటున్నారు!... స్వార్థం కోసం అబద్ధాలాడి!... నిజాన్ని దాచి - వేరే కులమని, వేరే మతమని చెప్పుకుంటున్నారు. ప్రయోజనాన్ని పొందుతున్నారు.! ... అలాటి రోజులు వచ్చాయి...

కాని... నీతి, నియమాలకు కట్టుబడిన తన లాటి వాళ్లు అలాటి అవినీతికి దిగజారలేరు... జీతం ఆఖరి సంఖ్యను చేరి ఆరేళ్లయినా .. మరి యింక్రిమెంటు లేదు! ప్రమోషనూ లేదు!! నెలనెలా ఆ ఎదుగని జీతమే అందుకుంటూ గడుపుతున్నాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ, పిల్లలు పెద్దవాళ్లయి, బాధ్యతలూ ఎక్కువయి కథలూ, కార్యాలూ, చదువులూ యివన్నీ చాలీ చాలని ఆ జీతం లోనే అందరి ఖర్చులూ, అవసరాలూ, తీర్చుకుంటూ వస్తున్నాడు... యీ బాధలు చూడలేక కాబోలు తల్లి ఏడాది క్రితమే కన్నుమూసింది...

ఒకే గది, ఒకే వరండా, చిన్న వంటిల్లు...రెండిళ్ల వాళ్లకి కలిపి బాత్రూమ్, లెట్రిన్... దీనికి రెండు వందలు అద్దె! ... అన్నీ... ఆకుంటె....కే అన్నట్టు..ముందు మించిపోయినట్టు... ఇద్దరూ ఆడపిల్లలే. అంచేత యిట్టే తిరక్కుండా ఎదిగి కూర్చున్నారు! పది పదిహేనేళ్లమండి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా, సంబంధాలు కుదరడం లేదు! ... వేలకు వేలు కట్నా లిచ్చుకోవే స్తోమత లేదు! .. అలా రోజులు గడిచిపోతున్నాయి!

యింక లాభం లేదు! ... ఎన్ని విధాల ప్రయత్నించినా యీ సమస్యలకు పరిష్కారం కనబడలేదు. తన జీతం మరి పెరగదు. కూతుళ్లకు పెళ్లిళ్లు కావు! రామూకి ఉద్యోగం దొరకదు!... వస్తుంది! ఎందుకురాదు? ... కాని తను బ్రతికి వుండగా మాత్రం యివేవీ కావు! యింకా తను బ్రతికి ప్రయోజనం ఏమిటి? జీవితంలో ఏం సాధించాడు గనుక? ... మీదు మిక్కిలి ఆస్తి సంపాదించనందుకు, ఇల్లు కట్టనందుకూ, కొడుకులని ప్రయోజకుల్ని చేయలేనందుకూ, కూతుళ్లకు పెళ్లిళ్లు చేయలేనందుకూ, భార్య వంటికి ఒక్క పిసరు బంగారమయినా పెట్టలేనందుకూ, బ్యాంకు బేలన్సు... కనీసం... ప్రావిడెంటు ఫండయినా వుంచనందుకు... తనని చాతకాని వాడని.. తిట్టుకుంటారే గాని, అసమర్థుడని, అనుకుంటారేగాని - ఎవరూ తనని ''ఓహో!'' అనరు!

''ఫలానా'' అని గుర్తుంచుకుందికి, చెప్పుకోదగ్గ పని తను ఏం చేశాడు కనుక? ఏం సాధించాడు గనుక? అప్పులు తప్ప! యింక వున్నంత కాలం బాధలు తప్పవు. అవి మరీ ఎక్కువ కాక ముందే -

తప్పుకుంటే మంచిది !

పెళ్లాం బిడ్డల్ని పోషించుకోలేక చచ్చాడు, అప్రయోజకుడు అని అంటారు. అంతే కదా! యింకెన్నాళ్లు మరో మూడేళ్లలో రిటైర్ అయితే... కొడుక్కి ఉద్యోగం దొరక్కుండానే వుంటే.. ఎలా పోషించగలడు? కళ్ళముందే కూతుళ్లు, ముద్దూ ముచ్చటా లేకుండా.... వుండిపోతే.... ఎలా భరించగలడు ?.. అంచేత యీ అసమర్థుడి జీవిత యాత్ర యిక్కడితో చాలిస్తే మంచిది.... చాలించక పరిస్థితులు మారతాయా ? ... అన్నిటి మాటా ఏమోగాని ... కొడుక్కి ఉద్యోగం మాత్రం అవుతుంది !... అప్పుడు జీవితంలో యిదే తను చేసిన ఒకే ఒక్క ప్రయోజనకరమయిన పని అవుతుంది ! బ్రతికుండగా సాధించలేనిది... చచ్చి సాధించినట్టవుతుంది ! ...

తన భార్య... యిన్నాళ్ళూ కలిసి మెలిసి వున్న తన లక్ష్మి ... ఏమయిపోతుంది!... ఎలా తట్టుకుంటుంది ! తను పోయాక తిన్నగా చూస్తారా ? ... తన భ్రమ గాని యీ లోకంలో అందరూ ఎలా వుంటున్నారు ? ... చచ్చిపోయాకా తనకెందుకా దిగులు?... యిలా ఆలోచిస్తూ వుంటే ఒక నిర్ణయానికి రాలేను. ఎలా జరిగేది... అలానే ... జరుగుతుంది !... ఇన్నాళ్లూ నడిపించిన భగవంతుడే... దారి చూపుతాడు!... అని అనుకున్నాడు.. ఒక విధమయిన ఆవేశం... ప్రవేశించింది!... ముకుందంలో -

ఎప్పుడు కరెంటు వచ్చిందో గాని... అమ్మవారి ముక్కు పుడక... మెరుస్తూంది!

వంటింట్లో ''కిచకిచ'' అరుపు... పిల్లి ఎలుకని పట్టుకొని తన ప్రక్కనుండే వెళ్లిపోతోంది ! యిన్నాళ్లకి చూశాడు తన యింట్లో పెంచుతున్న పిల్లి ఎలుకను పట్టడం! నవ్వుకున్నాడు... ముకుందం!... ఒక జీవుడు ఖాళీ అయితేనేగాని... మరో జీవుడికి కడుపు నిండదు !... బ్రతుకూ లేదేమో !

కుర్చీలోనుండి లేచి... మళ్లీ చప్పుడు లేకుండా... ఎవరినీ తగలకుండా పడుకున్న భార్యా బిడ్డల మధ్య నుండి దాటుకుంటూ వెళ్లి ... మంచం మీద కూర్చున్నాడు ! భార్య వయిపు చూశాడు ప్రేమగా... ఆమె ఒకసారి వత్తిగిలి పడుక్కుంది. మిగతా వారందరూ నిశ్చింతగా నిద్రపోతున్నారు !

టైమెంతయి వుంటుందా ! అని అనుకున్నాడు...కాని... గడియారం శబ్దం ... వినబడలేదు.... తాతలనాటి గోడ గడియారం ! .. అదీ .. ఆగిపోయి వుంటుంది. ఎంతయితేనేం ? గడియారం ఆగినంత మాత్రంలో తెల్లవారడం మానుతుందా ?

రాత్రి పడుక్కునే ముందే తలగడ క్రింద ఎవరూ చూడకుండా వుంచుకున్న నిద్ర మాత్రల సీసా తీశాడు... యీ మాత్రలు .. తనకొకసారి జబ్బుచేస్తే నెల్లాళ్లు జనరల్ హాస్పటల్లో వున్నాడు. - అప్పుడు రోజూ ఒకటి రెండు మాత్రలు యిచ్చేవారు. కాని వాటి అవసరం తనకు అంతగా లేకపోవడం చేత అవన్నీ ఒక సీసాలో దాచి వుంచాడు. వీటిగురించి ఎవరూ పట్టించుకోలేదు ! ... ఎవరిక్కావాలి!... వాటి ఉపయోగం యిప్పుడు వచ్చింది.

భార్య మంచం క్రింద వుంచిన మంచి నీళ్లు తీసుకున్నాడు. మాత్రలు.. నోటిలో వేసుకుంటూ- నీళ్లూ, ఆ మాత్రలూ, కూడా ఖాళీ చేశాడు ! సరి ! యింకెంతసేపు? మహా అయితే ... ఒక ఘంట! లేదా మరో ఘంట ! తెల్లవారేటప్పటి కల్లా.. సరి !

కన్నులు మూతలు పడుతున్నాయి ! ... సావకాశంగా... హాయిగా... పడుక్కున్నాడు!... మత్తు కమ్ముతూ వుంది ! ... అప్పుడయినా మిగతా ఆలోచనలు మానుకుని భగవంతుణ్ణి తలుచు కుందా మనుకున్నాడు ముకుందం !....

- హరే..రామ ! హరే రామ ! రామ రామ హరే ! హరే ! హరేకృష్ణ! హరేకృష్ణ ! కృష్ణ కృష్ణ హరే హరే! హరే! రామ! హరేకేశవా ! మాధవా ! గోవిందా ... ముకుందా....

★ ★ ★

- (అముద్రితం)